క్లుప్తంగా

హయ్యర్ బెల్ట్ పోటీల్లో బేతంచెర్ల చిన్నారుల ప్రతిభ

బేతంచెర్ల: కర్నూలులో అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో బేతంచెర్ల పట్టణానికి చెందిన చిన్నారులు హయ్యర్ బెల్ట్‌లో ప్రతిభ కనబరిచారు. ఈనెల 11 జరిగిన హైయ్యర్ బెల్ట్ టెస్టు పోటీల్లో బేతంచెర్ల పట్టణానికి చెందిన కారుణ్య, లక్ష్మీప్రణతి, శ్రీ వల్లిరెడ్డి అయేషా, సాయి ధరమ్‌తేజ, జాకీర్ హుస్సేన్, అమృత, దినేష్, అక్రమ్, ఫయాజ్, మల్లేష్, సుహాసిని, మని చంద్ర, లెనిషా, మహిధర్ పాల్గొని పతకాలు సాధించారు. జాతీయస్థాయి యంగ్ మూడో పోటీల్లో ప్రతిభ చాటడానికి కృషి చేస్తున్నట్లు శిక్షకులు వెంకటేష్, నాగన్న తెలిపారు.

రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు

సంజామల: ఖరీఫ్ సాగు నిమిత్తం ముందస్తుగా మండల పరిధిలోని 11 రైతు భరోసా కేంద్రాలలో ఎరువులను నిల్వ ఉంచామని ఏఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. కానాల, ఆల్వకొండ, ఆర్ లింగందిన్నె, ఆకుమల్ల, పెరుసోముల రైతు భరోసా కేంద్రాలలో డీఏపీ 50 మెట్రిక్ టన్నులు, 16 మెట్రిక్ టన్నులు 20:20:0:13, 5 మెట్రిక్ టన్నులు 16:16:16, 36.72 మెట్రిక్ టన్నులు యూరియ అందుబాటులో ఉందన్నారు. 90 మెట్రిక్ టన్నులు, డీఏపీ 50 మెట్రిక్ టన్నుల యూరియ ఈ వారంలోపు రావాల్సి ఉందని తెలిపారు. ఎరువులు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలను సంప్రదిచాలన్నారు. అర్హతలు ఉండి రైతు భరోసా పొందని రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలని సూచించారు.

బీమా సాయం అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం గ్రామానికి చెందిన ఈడిగ కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని భార్య అనసూయమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేలను పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ షాహీనా ,వలంటీర్లు, సర్పంచ్ ప్రమీలమ్మ, వైఎస్సార్ నాయకుల చేతుల మీదుగా అందజేశారు.

నేత్ర దానం

బేతంచెర్ల: పట్టణంలోని రేగిమానుపేట కాలనీకి చెందిన సుభాష్ రావు అనారోగ్యంతో మరణించారు. మృతుని కుటుంబ సభ్యులు నేత్రాలు దానం చేస్తామని లైఫ్ యువనేత్ర సమితి సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కర్నూలు ఐ బ్యాంకు వైద్యులు మృతుని నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా తీసుకున్నారు.


ఉద్యాన పంటల సాగుకు అనుమతులు

ప్యాపిలి: మండలంలో 2023–24కు గాను 300 ఎకరాల్లో ఉపాధి హామి పథకం ద్వారా ఉద్యాన పంటలు సాగుకు అధికారుల నుంచి అనుమతులు వచ్చినట్లు ఏపీఓ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన ఏనుగుమర్రిలో పండ్ల తోటల రైతులు తీస్తున్న గుంతలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం 400 ఎకరాల్లో సాగు చేసేందుకు అధికారులు లక్ష్యాన్ని నిర్ధేశించగా 300 ఎకరాల్లో సాగుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆగస్టు నుంచి రైతులు పండ్ల మొక్కలు నాటుకోవచ్చని తెలిపారు. గత ఏడాది 250 ఎకరాలు, 2021–22లో 300 ఎకరాల్లో పండ్ల తోటలు సాగులో ఉన్నాయని తెలిపారు.

జన జాగృతి సభను జయప్రదం చేయాలి

డోన్ టౌన్ : విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రంహ్మయ్య మాదిగ నాయకత్వంలో జరుగనున్న జన జాగృతి మహా సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ రాజుమాదిగ పిలుపునిచ్చారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మహా సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం నాయకులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే ఎంఆర్‌పీఎస్ లక్ష్యమన్నారు. రాజకీయ పెద్దలు, మేధావులను ఒక వేదికపైకి తీసుకవచ్చేందుకు నిర్వహిస్తున్న సభకు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జీవన్‌మాదిగ, దేవ, రాజుమాదిగ, బబ్లూ, ప్రవీణ్, విజయ్, హుస్సేన్, రవికిరణ్, రాఘవ, కాసీం, గుండాలశ్రీను పాల్గొన్నారు.

ఐకమత్యంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివరాం

డోన్ టౌన్: సమస్యలపై కార్మికులు ఐకమత్యంగా పోరాడాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా రీజినల్ కార్యదర్శి శివరాం పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన కార్మికుల జనరల్‌బాడీ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గ్యారేజ్‌లో అక్రమ చార్జ్ షీట్లు, డ్యూటీలు కేటాయింపులో ఏక పక్ష నిర్ణయాలు సమంజసం కాదన్నారు. సమావేశంలో ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రావు, రీజినల్ చైర్మన్ కోటేశ్వరరావు, రీజినల్ ప్రచార కర్త డీవీఆర్ రెడ్డి, డోన్ డిపో అధ్యక్షుడు సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల.. నెరవేరుతున్న వేళ!

- బనగానపల్లె నియోజకవర్గానికి 12,490 గృహాలు మంజూరు
- గ్రామాలను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- చురుగ్గా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు
- ఇప్పటి వరకు చెల్లించిన బిల్లులు రూ. 42.89 కోట్లు



సంజామల మండలం ముక్కమల్ల గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్



వెంకటాపురం గ్రామంలో పూర్తయిన గృహం

బనగానపల్లె: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ మేరకు అర్హులందరికీ ఇంటి పట్టాతో పాటు గృహాన్ని మంజూరు చేసింది. ఏ ఒక్కరి నుంచి సొంతిళ్లు లేదనే మాటే వినపడ కూడదనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జగన్న లేఅవుట్‌లు గ్రామాలను తలపిస్తున్నాయి. సొంతింటి కల నెరవేరుతున్న వేళ పేదలు ఇళ్ల నిర్మాణాలను సంతోషంగా చేపట్టారు. బనగానపల్లె నియోజకవర్గంలో అర్హులైన పేదలకు 12,497 గృహాలు మంజూరు అయ్యాయి. అయితే నియోజకవర్గ కేంద్రం బనగానపల్లె పట్టణానికి చెందిన పేదలు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి మోకాలడ్డడంతో ఇళ్ల పట్టాల పంపిణీ జరగలేదు. ఇప్పటి వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 1,789 ఇళ్ల నిర్మాణ పూర్తయ్యాయి. బీబీఎల్ స్థాయిలో 6,457, బీఎల్ స్థాయిలో 1,846, ఆర్‌ఎల్ స్థాయిలో 542, ఆర్‌సీ స్థాయిలో 255 గృహాల నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పటి వరకు గృహ నిర్మాణాల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ. 42.89 కోట్లు జమ చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.

మౌలిక వసతుల కల్పన

నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల వివరాలు

మండలం	మంజూరు గృహాలు	వివిధ దశల్లో నిర్మాణం	పూర్తయినవి
బనగానపల్లె	3,276	2,133	658
కోవెలకుంట్ల	2,976	2,387	391
అవుకు	1,632	1,200	-
కొలిమిగుండ్ల	2,210	1,620	296
సంజామల	2,403	1,763	444

ఆయా గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించింది. రహదారులు, నీరు, విద్యుత్ తదితర వసతులు కల్పించడంతో గృహ నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. అధికారులు లబ్ధిదారులకు అనుకూలంగా నాణ్యమైన కిటికీలు, తలుపులు, డోర్ ఫ్రేం, షట్టర్ శానిటరీ మెటీరియల్, సిమెంట్, ఇసుక సరఫరా చేస్తున్నారు.

అదనంగా బ్యాంకు రుణాలు

ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80లక్షలు అందిస్తుంది. ఇంటి నిర్మాణ స్థాయి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాగానే బిల్లులకు సంబంధించిన నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారు అధికారులు. అదే విధంగా లబ్ధిదారులు తమకు అనుకూలంగా గృహాన్ని నిర్మించుకునేందుకు అదనంగా బ్యాంక్ రుణం వసతి కల్పించింది ప్రభుత్వం. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు రూ.35 వేల బ్యాంక్ రుణం ఇస్తున్నారు. దీంతో గృహ నిర్మాణాలు ఊపందుకున్నాయి.

బనగానపల్లె పట్టణ పేదలకు శాపంగా మాజీ ఎమ్మెల్యే బీసీ!

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లె పట్టణ పేదలకు శాపంగా మారారు. దీంతో పట్టణ పేదలు సొంతింటి కల... కలగానే మిగిలింది. బనగానపల్లె పట్టణంలో ఇరుకు ఇళ్లలో పేదల జీవనాన్ని గుర్తించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరువతో అర్హులైన పేదలదరికీ మూడువేలకు పైగా ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. అయితే మాజీ ఎమ్మెల్యే బీసీ కుంటి సాకులు చూపుతూ తన అనుకూలులతో కోర్టులో స్టే వేయించడంతో ఇళ్ల పట్టాల పంపిణీ నిలిచిపోయింది. అయితే న్యాయపోరాటంలో గెలిచి అర్హులందరికీ ఇంటి పట్టాతోపాటు గృహాన్ని మంజూరు చేస్తామని బనగానపల్లె పట్టణ పేదలకు భరోసా ఇస్తున్నారు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి.

సొంత ఇంటి కల నెరవేరనుంది



అనంతపురం జిల్లా నుంచి అవుకుకు బతుకుదెరువుకు పదిహేనేళ్ల క్రితం వచ్చాం. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే జీవనంగడపుతున్నాం. మాకు ఇద్దరు సంతానం. కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాం. గత ప్రభుత్వంలో మాకు ఇళ్లు రాలేదు. సీఎం జగనన్న దయతో ఎస్సార్‌బీసీ కాలనీలో స్థలంతో పాటు గృహం మంజూరైంది. త్వరలో సొంత ఇంటికల నెరవేరనుంది.

– నారాయణమ్మ, అవుకు

అద్దె ఇంటి నుంచి విముక్తి



ఇరవైఏళ్లుగా మాకు సొంత ఇళ్లులేదు. అద్దె ఇంట్లో ఉంటున్నాం. నా భర్త స్థానిక సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు కార్మికుడుగా పని చేస్తున్నాడు. మాకు ఇద్దరు సంతానం. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాకు ఇంటి పట్టాతో పాటు ఇళ్లు కూడ మంజూరుకావడంతో ఇంటి నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. నేడు నూతన గృహంలో చేరుతున్నాం.

– గోగుల జ్యోతి, తుమ్మలపేంట, కొలిమిగుండ్ల మండలం

గృహ నిర్మాణ పథకం పేదలకు వరం



జగనన్న ప్రభుత్వంలో అమలుపరచిన గృహ నిర్మాణ పథకం ఇళ్లులేని పేదలకు వరంలాంటిది. చాలా కాలంగా మాకు సొంత ఇళ్లు లేదు. ఈ పథకం ద్వారా ఇళ్లు మంజూరైయింది. పొదుపు మహిళగా నాకు రూ.35వేలు అదనపు రుణం మంజూరైంది. ఎట్టకేలకు ఇంటిని నిర్మించుకున్నాం. జగనన్న దయతో మా కుటుంబం సొంత ఇంటిని పొందాం. సీఎం సాయం మరువం.

– కె. లక్ష్మీదేవి, వెంకటాపురం బనగానపల్లె మండలం

జగనన్నకు కాంట్రాక్టు అధ్యాపకుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

బనగానపల్లెరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయడంపై కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జిల్లా సెక్రటరీ కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కాంట్రాక్టు అధ్యాపకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన స్వగృహం వద్ద కలిసి ఎమ్మెల్యే కాటసానితో పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ జూన్ 02, 2024 వ సంవత్సరానికి ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ప్రతిపాదించారని, దీంతో రెండువేల మంది కాంట్రాక్టు అధ్యాపకులు నష్ట పోయే పరిస్థితి ఉందన్నారు. జూన్ 02వతేదీ 2014 నాటికి ఐదు సంవత్సరాలు సర్వీస్ ఉండాలనే నిబంధనలను తొలగించి ఆరోజుకు సర్వీస్‌లో ఉన్న వారందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు రామయ్య, నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మురళి మోహన్‌గౌడ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన ఇందిరానగర్ యువకులు

డోన్ : పట్టణంలోని 29, 30వ వార్డులకు చెందిన యువకులు మంగళవారం టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్ సమక్షంలో ఆ వార్డు కౌన్సిలర్ మేకల రాజు ఆధ్వర్యంలో 12 కుటుంబాలకు చెందిన యువకుల వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



గోర్లగుట్ట గ్రామంలో వలంటీర్లను సత్కరించిన ఎంపీపీ, ఎంపీడీఓ, గ్రామ సర్పంచ్‌లు

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గోర్లగుట్టలో ఎంపీడీఓ వెంగన్న, గ్రామ సర్పంచ్‌లు బూషి మాదక్క పంచాయతీ కార్యదర్శి శ్రీలత, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ, ఎంపీడీఓ వలంటీర్లకు పురస్కారాలు, మెడల్స్ అందజేసి శాలువలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఎవరి సిఫారసు లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్న వలంటీర్లు అభినందనీయులని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ తనిఖీ చేశారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని ఎంపీపీ ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీర్ గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న , రామసుబ్బయ్య గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక అందజేత



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

బేతంచెర్ల: మండలంలోని ఎంబాయి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుజాత, సౌజన్య, జనార్ధన్‌రెడ్డి, నాగేషుడు ఆధ్వర్యంలో హెచ్‌ఎం వజిదున్నిస జగనన్న విద్యా కానుకను అందజేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అంకిత భావంతో కృషి చేస్తున్నారని హెచ్‌ఎం గుర్తు చేశారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని, సకల మౌలిక వసతులు కల్పించారన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



విజేత జట్టుకు జ్ఞాపిక, నగదు అందజేస్తున్న కాటసాని తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లె: క్రీడాకారులు గెలుపోటములను ఓటమిలను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడు, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని నందవరం గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్దకుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎన్నో సమాజిక సేవ కార్యక్రమలతో పాటు సాంస్కృతిక, క్రీడా పోటీలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విజేత జట్లకు మొదటి బహుమతిగా రూ.20వేలను ఎమ్మెల్యే కాటసాని తనయుడు కాటసాని ఓబులరెడ్డి, రెండవ బహుమతిగా రూ.10వేలను కాటసాని తిరుపాల్ రెడ్డి అందించారు. మూడవ, నాల్గవ బహుమలు రూ.5వేలు, రూ.3వేలు దాతలు అందజేశారు. విజేతలకు కాటసాని తిరుపాల్‌రెడ్డి సీల్డ్‌తో పాటు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు శివలింగారెడ్డి,కాటసాని ఓబులరెడ్డి యూత్ సభ్యులు పాపిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అంబటిరవికుమార్‌రెడ్డి, అత్తార్ అఖిల్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు విద్యార్థిని ఎంపిక

డోన్ టౌన్ : డోన్ నియోజకవర్గం స్థాయిలో జగనన్న ఆణిముత్యాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ టీ.శశికల ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ కృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శశికల హెచ్‌ఈసీ గ్రూపులో 1000/861 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

ట్యాంకులతో నీటి సరఫరా

ప్యాపిలి: మండల పరిధిలోని జక్కసానికుంట్లలో ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్ల ద్వారా అదనంగా నీటి సరఫరా చేస్తున్నారు. డ్రైనేజీ పనులు చేపడుతున్న కారణంగా ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి తలెత్తింది. దీంతో అధికారులు ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. అయితే ట్యాంకర్ నీరు చాలడం లేదని ప్రజలు కోరుతున్నట్లు సోమవారం సాక్షిలో కథనం వెలువడింది. దీంతో రోజుకు మూడు ట్యాంకర్ల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

నివాళి

అవుకు(కొలిమిగుండ్ల):కొలిమిగుండ్ల మండలం మద నంతపురం గ్రామానికి చెందిన అంబటి అంకి రెడ్డి (64) గుండెపోటుతో కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. విష యం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మృతదేహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్ భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంబటి గురివి రెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణ రెడ్డి, ఓబులేసు తదితర నాయకులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

కోవెలకుంట్ల: పది సంవత్సరాలకు పైబడి సర్వీసు ఉన్న ఒప్పంద అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం జిల్లా జేఏసీ కన్వీనర్ అబ్దుల్ జబ్బార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం 2000–2008 సంవత్సరాల మధ్య కాలం నుంచి పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ చేపట్టిందన్నారు. 2009–2011 మధ్య కాలంలో జిల్లాలో 140 మంది అధ్యాపకులు జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులుగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. వీరందరిని పరిగణలోకి తీసుకుని రెగ్యులరైజ్ జాబితాలో చేర్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతిపత్రం అందజేశామన్నారు.

ప్రజల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి

డోన్ టౌన్: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని వలిసెల, ఆర్ మల్కాపురం గ్రామాల్లో మంగళవారం సర్పంచ్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ కులమత ప్రాంతీయ విబేధాలు,రాజకీయలకు తావు లేకుండ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రభుత్వ పథకాలు అందని అర్హులు ఎవ్వరైన ఉంటే సమీప సచివాలయంలో లేదా తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, ఎంపీటీసీలు సువర్ణ, రామలక్ష్మి, మాజీ ఎమ్పీటీసీ బద్దల నాగరాజు, ఉప సర్పంచ్ రాజేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, రమణ, మురళీ, మోకు మద్దయ్య, వెంకటసుబ్బారెడ్డి, బోయ రామచంద్రుడు, సుదర్శనరెడ్డి, సంజీవుడు, చిన్న ఈశ్వరయ్య, రంగస్వామి, హౌసింగ్ ఏఈ నాగభూషణం,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఈఓఆర్డీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లెరూరల్: అతిసార వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. మంగళవారం మండలంలోని మీరాపురం గ్రామంలో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు ఆధ్వర్యంలో ఐడీసీఎఫ్ ప్రొగ్రాం కింద పిల్లల్లో నీళ్ల విరోచనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వర్షా కాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

డోన్: పట్టణానికి చెందిన విద్యార్థి హర్షవర్ధన్‌కు రోటరీ క్లబ్ ఆర్థిక సాయం చేసింది. బెంగళూరుకు చెందిన దివాకర్‌రెడ్డి, శ్వేత,దశరథరామిరెడ్డి, జగన్‌మోహన్, డోన్‌కు చెందిన సుగుణాకర్‌రావ్, జింకల క్రిష్ణ, శేఖర్‌గౌడ్, లక్ష్మిరెడ్డి, మల్లారెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఎల్ఐసీ శంక ర్,నాగరాజుల సహకారంతో ఆదివారం విద్యార్థి తల్లిదండ్రులకు రోటరీసభ్యులు రూ.20వేలు అందజేశారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

సంజామల: రెండు దశల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ నాగ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఆకుమల్ల, ముడిగేడు గ్రామాల జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలను మంగళవారం ఏఈ ఏఈ బాలచంద్రుడుతో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. పైప్‌లైన్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ విష్ణు వర్ధన్ రెడ్డి, సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండాలి

అవుకు: వర్షాకాలం ప్రారంభమవుతుందని, సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్ అన్నారు. మంగళవారం గుండ్లశింగవరం గ్రామం అంగన్‌వాడీ సెంటర్‌లో అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలతో దోమలు పెరిగి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, బోధకాలు వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లావణ్య, ఏఎన్ఎం చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రశాంతి, అనసూయ పాల్గొన్నారు.

కొండమీది పల్లెలపై ప్రత్యేక దృష్టి

- ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: మండల పరిధిలోని కొండమీది గ్రామాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండమీద పల్లెలైన ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయునిపల్లె గ్రామాల పెద్దలు, అధికారులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఎంపీపీ సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీటిని అందిస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2020లో అవుకు మండలంలో తాగునీటి ఎద్దడి పరిష్కారానికి రూ.8.50కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఇంకా పలు గ్రామాల్లో టెండరింగ్ జరగనందున దాదాపు రూ.3.73 కోట్లు పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఓహెచ్‌ఆర్ ట్యాంక్, పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటుకు కొండమీది గ్రామాలైన పిక్కళపల్లి తండాకు రూ.56.6లక్షలు, ఉప్పలపాడుకు రూ.25.30లక్షలు, జూనూతలకు రూ.28.80 లక్షలు, కొండమనాయునిపల్లెకు రూ.22.40లక్షలు, మారేమడుగులకు రూ.15లక్షలు మంజూరయ్యాయని, వీటికి టెండర్‌లు పిలిచి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా ఉప్పలపాడు గ్రామంలో రూ.20లక్షలతో ఎస్సీ కాలనీ, కోటవీధికి, జూనూతల గ్రామంలో రూ.10లక్షలు బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామస్తులు కలిసికట్టుగా ఉంటే కొండమీది గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తెలుగు రామప్ప, పీఆర్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈలు గౌస్, కరిముల్లా, ఆయా గ్రామాల పెద్దలు నారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, శివా రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను ఆక్రమించారనే ఆరోపణలు సరికాదు

- టీడీపీ నాయకులు నిజాలు తెలుసుకొని మాట్లాడాలి
- అసత్యారోపణలు చేస్తే ప్రజా క్షేత్రంలో తిరుగుబాటు తప్పదు
- సమాజసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి మంత్రి బుగ్గన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలపై నిరాధరణ ఆరోపణలు చేయడం సరికాదని, నిజాలు తెలుసుకొని మాట్లాడితే గౌరవ ప్రదంగా ఉంటుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యుడు మూర్తుజావలీ సూచించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రావు బహదూర్ బీపీ శేషారెడ్డి ముందు చూపుతో బడి, గుడి, ప్రజా వైద్యశాల, పశు వైద్య శాల నిర్మించి ఆదర్శంగా నిలిచారన్నారు. తాత బాటలో నడుస్తూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రాజకీయాల్లోకి రాకమునుపే బేతంచెర్ల, డోన్ పట్టణంలో బాలికల సౌకర్యార్థం అధునాతన పాఠశాల భవనాలు, ప్యాపిలిలో ప్రజల కోసం వైద్య శాల నిర్మించారని గుర్తు చేశారు. సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి పదవులను అలంకరించిన మంత్రి బుగ్గన డోన్ నియోజకవర్గంలో ముప్పైఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపెట్టారన్నారు. అయితే 100 కోట్ల విలువ చేసే శేషారెడ్డి ఉన్నత పాఠశాలను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆక్రమించారని ఆరోపణలు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. 1951లో నుంచి ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ను అందించిన శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఎయిడెడ్ పాఠశాల కావడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు 2021 వరకు కొనసాగిందని, సుమారు 70 సంవత్సరాల నుంచి సేవలు అందించిన ఘనత బుగ్గన కుటుంబానికి దక్కిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎయిడెడ్ పాఠశాలను తొలగించడంతో ప్రస్తుతం అందులో పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ, నర్సింగ్, డ్రోన్ పైలెట్ శిక్షణ కొనసాగుతుందన్నారు. విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పై ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజల నుంచి నీరు తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలోవాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.